క్లుప్తంగా

నేడు, రేపు విద్యుత్‌కు అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: అత్యవసర మరమ్మతుల కారణంగా మంగళ, బుధవారాల్లో నగరంలో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నక్కపల్లి శామ్యూల్ తెలిపారు.

- మంగళవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 వరకూ మసీదు వీధి, పంచాయతీ వీధి, కొత్తపేట, వేంకటగిరి కొండ, జిల్లా స్టోర్స్, తహసీల్దార్ కార్యాలయం, బొమ్మూరు సెంటర్ నుంచి రాజవోలు రోడ్డు వరకూ, సుద్దకొండ, నేతాజీనగర్ వీధులు, బొమ్మూరు చెరువు సెంటర్ నుంచి బాలాజీపేట జంక్షన్ వరకూ, ఏసీబీ కాలనీ, రాఘవేంద్రనగర్ కాలనీ, గురుకులం ఏరియా, సెయింటాన్స్ స్కూల్, కేవీఆర్ నగర్‌లలో సరఫరా ఉండదు.
- మంగళవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 11 వరకూ నగరంలోని స్టేడియం రోడ్డు, టి.నగర్, శ్యామల థియేటర్ రోడ్, పెద్దాడ వారి వీధి, చల్లపల్లి వారి వీధి, న్యాపతి వారి వీధి, గోదావరి గట్టు, మూడు గుళ్ల వారి వీధి, ఉడిపి అక్షయ వీధి, హోటల్ ఫుడ్ ఎక్స్, ఆచంట వారి వీధి, మొదలగు ఏరియాల్లో సరఫరా నిలిచిపోతుంది.
- మంగళవారం ఉదయం 7.30 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు సీతంపేట, కోటిలింగాలపేట, ఎన్టీఆర్ కాలనీ, ఈఎస్ఐ ఆసుపత్రి పరిసర ప్రాంతం, టీచర్స్ కాలనీ, మూలగొయ్యి సెంటర్, రామాలయం సెంటర్‌లలో అంతరాయం కలుగుతుంది.
- బుధవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పోలీస్ క్వార్టర్స్, కవలగొయ్యి, పిడింగొయ్యి, ఎన్‌హెచ్ -16 హైవే రోడ్ ఏరియా, ఫ్యూచర్ కిడ్స్ ఏరియా, తారకరామానగర్, బాలాజీ నగర్, రూపానగర్, స్వరూప నగర్, మహాలక్ష్మి నగర్ ప్రాంతాలలో విద్యుత్ ఉండదు.
- బుధవారం ఉదయం 7 నుంచి 10 గంటల వరకు రాయుడు పాకలు, కోలమూరు, కొంతమూరు గ్రామంలోని పరిమినగర్, బొమ్మన కాలనీ, ఫోర్ట్ బ్రిడ్జ్ ఏరియా, సాయిరాం కాలనీలలో విద్యుత్ ఉండదు.
- బుధవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కొత్త రోడ్ ఏరియా, స్వతంత్ర హాస్పిటల్ ప్రాంతం, కృష్ణానగర్ ఏరియాలలో అంతరాయం కలుగుతుంది.

కడియం: ఆర్‌డీఎస్ఎస్ పనుల కోసం వేమగిరి సబ్‌స్టేషన్‌లోని జేగురుపాడు ఫీడర్‌కు మంగళవారం మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని విద్యుత్ శాఖ ఈఈ జేపీబీ నటరాజన్ తెలిపారు. దీంతో జేగురుపాడు గ్రామానికి విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించండి

కంబాలచెరువు: ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను చేర్పించాలని నాలుగో వార్డు ఇన్‌చార్జి మాజీ కార్పొరేటర్ నక్కా చిట్టిబాబు అన్నారు. రాజేంద్ర నగర్ మండల పరిషత్ మోడల్ ప్రాథమిక పాఠశాలలో సోమవారం బాలసదనం బాలికల వసతి గృహానికి చెందిన సుమారు 20 మంది విద్యార్థినులను చేర్పించారు. కార్యక్రమంలో పాఠశాల పూర్వపు విద్యార్థి, పీఎంపీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు బళ్ళా శ్రీనివాసరావు, ఎస్సీ, ఎస్టీ, బీసీ ఉద్యోగ సంఘ నాయకులు కోరుకొండ చిరంజీవి, తాళ్లూరి బాబూ రాజేంద్ర ప్రసాద్, బాలసదనం ఇన్‌చార్జి జి.రోజారాణి ప్రధానోపాధ్యాయులు జేడీఐజే డేనియల్ పాల్గొన్నారు.

హామీలు అమలు చేస్తున్నాం

కడియం: కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఒకొక్కటిగా అమలు చేస్తున్నామని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. వేమగిరిలోని పేరూరి గంగాధర్ హైస్కూల్లో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. అనంతరం సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, విద్యాశాఖామంత్రి లోకేష్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు.

ప్లాస్టిక్ వస్తువులతో అనేక అనర్థాలు



ర్యాలీ చేస్తున్న పర్యావరణ ప్రేమికులు

కోరుకొండ (సీతానగరం): ప్లాస్టిక్‌ను నిషేధిద్దాం – పర్యావరణాన్ని పరిరక్షిద్దాం అంటూ సీతానగరం మండలం కాటవరంలో సోమవారం భారీ ర్యాలీ నిర్వహించారు. ప్లాస్టిక్ వ్యతిరేక ఉద్యమం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పర్యావరణ ప్రేమికులు, స్థానికులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్లాస్టిక్ వ్యతిరేకోద్యమం నాయకురాలు గారపాటి వనజ మాట్లాడుతూ ఈ నెల 21, 22 తేదీల్లో జరిగే గ్రామ దేవత పాశాలమ్మ జాతర సందర్భంగా గ్రామానికి అధిక సంఖ్యలో బంధువులు, స్నేహితులు వస్తారన్నారు. ఆ సమయంలో ప్లాస్టిక్ వస్తువులు ఉపయోగిస్తే పర్యావరణానికి హాని జరుగుతుందన్నారు. కాబట్టి ప్లాస్టిక్ వస్తువులను నిషేధించాలని విజ్ఞప్తి చేశారు. వాటి వల్ల కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్న లక్ష్యంతో ఈ ర్యాలీ నిర్వహించినట్టు పేర్కొన్నారు. కాగా, పాశాలమ్మ ఆలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ గ్రామంలోని ప్రధాన వీధుల మీదుగా సాగింది. కళాకారులు ప్రదర్శనల ద్వారా స్థానికులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో చిట్టూరి రమేష్, జాస్తి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఖరీఫ్ సాగేదెలా..

- పెట్టుబడికి రైతుల అవస్థలు
- జమ కాని ధాన్యం సొమ్ములు



ఆకుమడికి విత్తనాలు చల్లుతున్న రైతులు

కడియం: ఖరీఫ్ సాగు పనులను రైతులు ప్రారంభించారు. ఎప్పటి మాదిరిగానే ప్రస్తుత సీజన్‌లో వరి సాగుకు ఆకుమడులు సిద్ధం చేసుకుంటున్నారు. నియోజకవర్గంలోని సుమారు ఐదువేల హెక్టార్లలో వరి పంట సాగవుతుంది. గత మంగళవారం, శుక్రవారాల్లో పది శాతం మంది వరకు రైతులు ఆకుమడులు వేశారు. ఈ వారంలో పూర్తిస్థాయిలో ఆకుమడులు చల్లుతారని వ్యవసాయ శాఖ సిబ్బంది చెబుతున్నారు. కాగా.. ఈ ఏడాది పెట్టుబడి కోసం రైతులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. కూటమి ప్రభుత్వం వ్యవసాయ పెట్టుబడి సాయం ఇవ్వడం లేదు. పైగా ధాన్యం అమ్మిన రైతులకు పూర్తిస్థాయిలో డబ్బులు చెల్లించలేదు.

ధాన్యం విక్రయించినా..

ఇదిలా ఉండగా ఈ నెల ప్రారంభంలోనే సాగు నీటిని కాలువల్లోకి విడుదల చేసి ప్రభుత్వం చేతులు దులిపేసుకుందన్న అభిప్రాయం రైతాంగం నుంచి వ్యక్తమవుతోంది. పెట్టుబడి సాయం మాట అటుంచితే, ఈ ఏడాది ధాన్యం డబ్బులు పూర్తిగా అందనే లేదని రైతులు చెబుతున్నారు. మే 10వ తేదీ వరకు ప్రభుత్వం కొనుగోలు చేసిన ధాన్యానికి డబ్బులు రైతులకు ఖాతాలకు జమ అయ్యాయంటున్నారు. అయితే మే 11వ తేదీ నుంచి ధాన్యం అమ్మిన వారికి డబ్బులు అందలేదు. ఇలా ప్రతి గ్రామం నుంచి 40 నుంచి వంద మంది వరకు రైతులకు ఈ విధంగా ధాన్యం డబ్బులు అందని సమాచారం.

దళారుల దందా

ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లను కొద్ది రోజులు నిలిపివేయడంతో దళారులు రంగ ప్రవేశం చేశారు. బస్తాకు సుమారు రూ.300 వరకూ తక్కువ ధర కట్టి, ధాన్యం కొనుగోళ్లు జరిపారు. వాస్తవానికి నియోజకవర్గంలోని రైతుల్లో 50 శాతం మందికి పైగా ఆ సమయంలో ముమ్మరంగా వరి కోతలు కోశారు. దీంతో వారిని దళారులు దోచుకున్నారు.

విత్తనాలు ఎక్కడ!

ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి ఒక్క గింజ విత్తనం కూడా అందుబాటులోకి రాలేదని రైతులు చెబుతున్నారు. వాటిని పూర్తిస్థాయిలో రైతులు ప్రభుత్వ విత్తనాలను వినియోగించుకోనప్పటికీ విత్తన ధరలను అదుపులో ఉంచడానికి ప్రభుత్వ విత్తన సరఫరా ఉపయోగపడేది. మరో పక్క వ్యవసాయ విద్యుత్ మోటార్ల కోసం గత ఏడాది దరఖాస్తు చేసుకున్నవారికి ఇంత వరకు వ్యవసాయ కనెక్షన్లు ఇవ్వలేదని రైతులు చెబుతున్నారు. సాగునీటి వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండడంతో బోర్లపై ఆధారపడి పంటలు సాగు చేద్దామనుకున్నా, సకాలంలో విద్యుత్ కనెక్షన్లు ఇవ్వక ఇబ్బందులు పడాల్సి వస్తోందంటున్నారు. ఈ నేపథ్యంలో రైతులకు చేదోడుగా గత ప్రభుత్వం అందించిన తోడ్పాటును అందరూ గుర్తు చేసుకుంటున్నారు.

ధాన్యం డబ్బు పడలేదు

మే 16న ధాన్యం అమ్మాను. అప్పట్నుంచి సంబంధిత డబ్బులు నా అక్కౌంట్‌కు రాలేదు. సిబ్బందిని అడుగుతుంటే ప్రభుత్వం వేయాలని చెబుతున్నారు. ఎప్పుడు వేస్తుందో అర్థం కావడం లేదు. మరో పక్క ప్రస్తుత సీజన్‌కు పనులు మొదలు పెట్టుకోవాలి. డబ్బులు అందితే పెట్టుబడిగా ఉపయోగపడతాయి. – కేవీఎస్ఎస్ మూర్తి, రైతు

పెట్టుబడి సాయం ఎప్పుడో..

కేంద్ర ప్రభుత్వం ఇచ్చే పెట్టుబడి సాయం మాత్రమే వస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం ఇస్తానన్నది మాత్రం రావడం లేదు. దాన్ని ఎప్పుడిస్తారో కూడా తెలియడం లేదు. ఎవరికి అడిగినా అదిగో, ఇదిగో అంటున్నారు. కనీసం ఆ డబ్బులు వచ్చినా పెట్టుబడికి ఉపయోగపడుతుంది.

– టి.వీరన్న, రైతు

ఇంటర్‌లో ప్రవేశానికి విద్యార్థులకు కౌన్సెలింగ్



కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, విద్యార్థులు, తల్లిదండ్రులు

రాజమహేంద్రవరం సిటీ: నగరపాలక సంస్థ పాఠశాలల్లో చదువుకుని, 2024 – 25 విద్యా సంవత్సరంలో పదోతరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ఇంటర్మీడియట్ కళాశాలల్లో ప్రవేశానికి కౌన్సెలింగ్ నిర్వహించినట్లు అడిషనల్ కమిషనర్ పీవీ రామలింగేశ్వర్ తెలిపారు. నగర పాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నగర పాలక సంస్థకు చెందిన 13 ఉన్నత పాఠశాలల్లో 176 మంది విద్యార్థులు 500కి పైగా మార్కులు సాధించారన్నారు. వీరందరూ కూడా తమకు నచ్చిన ఇంటర్మీడియట్ కాలేజీలలో అతి తక్కువ ఫీజుతో ప్రవేశానికి విద్యోన్నతి కార్యక్రమం ద్వారా నగరపాలక సంస్థ అవకాశం కల్పిస్తోందన్నారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి (అర్బన్) దిలీప్ కుమార్, నరసింహారావు, ఆర్ఎంసీ మేనేజర్ ఎండీ అబ్దుల్ మాలిక్, రెవెన్యూ ఆఫీసర్ సీహెచ్ శ్రీనివాసరావు, ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రైవేట్ కళాశాలల యాజమాన్యం పాల్గొన్నారు.

చంద్రబాబుకు ప్రజలే బుద్ధి చెబుతారు

- ఏడాది పాలనలో అన్నీ మోసాలు, అరాచకాలే
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు వేణు



బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి వేణుగోపాలకృష్ణ, వైఎస్సార్ సీపీ శ్రేణులు

రాజమహేంద్రవరం రూరల్: 'ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలు ఏదీ' అని ప్రశ్నిస్తే నాలుక మడతపెడతానన్న సీఎం చంద్రబాబుకు ప్రజలే బుద్ధి చెబుతారని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ అన్నారు. చంద్రబాబు ఏడాది పాలనలో మోసాలు, అరాచకాలే కనిపిస్తున్నాయన్నారు. సోమవారం రూరల్ నియోజకవర్గస్థాయిలో వేణు ఆధ్వర్యంలో 'జగన్ అంటే నమ్మకం.. చంద్రబాబు అంటే మోసం' అంటూ చంద్రబాబు ఏడాది పాలనలో అరాచకాలు, మోసాలను వివరిస్తూ ప్రచురించిన బుక్‌లెట్‌ను పార్టీ శ్రేణులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూపర్‌సిక్స్ పేరుతో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసేంతవరకు సీఎం చంద్రబాబుకు నిద్ర లేకుండా చేస్తామన్నారు. వైఎస్ జగన్ ప్రభుత్వం కంటే రెండింతలు ఇస్తామని చెప్పి, అధికారంలోకి వచ్చిన తరువాత చంద్రబాబు తల్లికి వందనం పేరుతో వంచన చేశారని ఆరోపించారు. రాష్ట్రంలో 87 లక్షల మంది తల్లులు ఉంటే 54 లక్షల మందికి మాత్రమే ఈ పథకం ఇచ్చారన్నారు. తల్లికి వందనం ఇచ్చే సమయంలో చంద్రబాబు మాట్లాడుతూ ఇక అన్ని సూపర్ సిక్స్ హామీలు నెరవేర్చామని, ఎవరైనా ప్రశ్నిస్తే వారి నాలుక మడత పెడతామని ప్రజలను బెదిరింపులకు పాల్పడటం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల వీర్రాజు (బాబు), మాజీ వైస్ ఎంపీపీ నక్కా రాజబాబు, కడియం మండల అధ్యక్షుడు యాదల సతీష్ చంద్ర స్టాలిన్, రాష్ట్ర యువజన విభాగ ప్రధాన కార్యదర్శి ఆరే చిన్ని, వివిధ విభాగాల నియోజకవర్గ అధ్యక్షులు చీకురుమిల్లి చిన్న, అంగాడ సత్య ప్రియ, కొత్తపల్లి శివాజీ, మాజీ సొసైటీ అధ్యక్షుడు తిరుమలశెట్టి శ్రీను, మండల వ్యవసాయ సలహా కమిటీ మాజీ చైర్మన్ ఈలి గోపాలం, పార్టీ నాయకులు ముత్యం జగదీష్, గాడ సాయిరాం, విప్పర్తి ఫణి, మార్గాని బాలరామ్, బోడపాటి సత్తిబాబు, చిలుకూరి రామకృష్ణ, సర్కార్ బాషా, రంభాల దుర్గారావు, దాసరి శ్రీను పాల్గొన్నారు.

ఆరుతడి పద్ధతులతో మెరుగైన దిగుబడి



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): వరి సాగులో నీటి పొదుపు, పర్యావరణ పరిరక్షణ, మెరుగైన దిగుబడుల కోసం ఆరుతడి పద్ధతులు చాలా అవసరమని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు అన్నారు. ఇన్నీసుపేటలోని అరుణ ప్యాలెస్‌లో వరిలో ఆరుతడి పద్ధతిపై మూడు రోజులు జరిగిన శిక్షణ సోమవారంతో ముగిసింది. జిల్లా ప్రకృతి వ్యవసాయ కార్యక్రమంలో భాగంగా అంతర రాష్ట్రీయ వరి పరిశోధన కోర్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్లకు ఈ శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు, ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ బి.తాతారావు మాట్లాడుతూ ఆరుతడి పద్ధతి ద్వారా తెగుళ్లు, పురుగుల ప్రభావం తగ్గుతుందని, సంప్రదాయ పద్ధతులతో సమానమైన, అంతకంటే మెరుగైన దిగుబడులు పొందవచ్చన్నారు. కోర్ ప్రాజెక్ట్ నిపుణులు మాట్లాడుతూ ఆరుతడి పద్ధతి విధానాలను వివరించారు. ఈ పద్ధతిలో 30 శాతం వరకూ సాగునీరు ఆదా అవుతుందని, పంట మంచిగా ఎదుగుతుందని, 50 శాతం వరకు మీథేన్ వాయువు విడుదలను తగ్గించవచ్చన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డీపీఎం మహబూబ్ వలీ, వారణాసి సౌత్ ఆసియా రీజినల్ సెంటర్ అసోసియేట్ శాస్త్రవేత్తలు అంకిత పాల్, పవన్, అంతర్జాతీయ రైస్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ ప్రతినిధులు అఖిల్, ప్రిన్స్, దివ్య, సతీష్ పాల్గొన్నారు.

జీవనభృతికి ఐదు ఎకరాలు కేటాయించండి

కలెక్టర్‌ను కోరిన మాజీ సైనికుడు



న్యూరోడిసీజ్‌తో బాధపడుతున్న మాజీ సైనికుడు రామసుబ్బారెడ్డి



కలెక్టర్ ప్రశాంతికి సమస్యను వివరిస్తున్న కుటుంబ సభ్యులు

రాజమహేంద్రవరం రూరల్: జీవనభృతికి బిక్కవోలు మండలం కాపవరం గ్రామంలో ఐదు ఎకరాలు భూమి కేటాయింపు జరపాలని న్యూరోడిసీజ్‌తో బాధపడుతున్న మాజీ సైనికుడు ద్వారంపూడి రామసుబ్బారెడ్డి, కుటుంబసభ్యులు సోమవారం కలెక్టర్ పి.ప్రశాంతిని కోరారు. ఈ సందర్భంగా రామసుబ్బారెడ్డి భార్య, కుమారుడు మాట్లాడుతూ కొవిడ్ వ్యాక్సిన్ తీసుకున్న తరువాత న్యూరో డిసీజ్‌తో తీవ్ర అనారోగ్యానికి గురయ్యారన్నారు. గతంలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్‌కు జీవనభృతికి భూమి కోసం అర్జీ ఇవ్వడం జరిగిందన్నారు. అప్పుడు జిల్లా పరిషత్‌కు చెందిన బిక్కవోలు మండలం కాపవరానికి చెందిన ఐదు ఎకరాలు భూమిని మాజీ సైనికుల కుటుంబాలకు మంజూరు చేయాలని ఆదేశాలు ఇవ్వడం జరిగిందన్నారు. జిల్లాల విభజన నేపథ్యంలో ప్రస్తుత తూర్పు గోదావరి జిల్లా పరిధిలోకి బిక్కవోలు మండలం కాపవరం గ్రామం రావడం జరిగిందన్నారు. కావున తమకు ఐదు ఎకరాల భూమిని మంజూరు చేయాలని అర్జీని అందజేశారు. ఈ విషయంపై స్పందించిన కలెక్టర్ ప్రశాంతి.. పూర్తిస్థాయిలో విచారణ చేసి నివేదిక అందించాలని జిల్లా రెవెన్యూ అధికారిని ఆదేశించారు.

బాధిత కుటుంబాలకు నాగేశ్వర్ పరామర్శ



అక్షర కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న చందన నాగేశ్వర్

ధవళేశ్వరం: గ్రామంలోని బస్టాండ్ వెనుక చెట్టు కొమ్మ పడటంతో విద్యుత్ వైర్లు తగిలి షాక్‌కు గురై మృతి చెందిన బాలిక పాతూరి అక్షర కుటుంబ సభ్యులను, ప్రమాదంలో గాయపడిన దేవదాసి లిషితను రాష్ట్ర పచ్చదనం, సుందరీకరణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ చందన నాగేశ్వర్ సోమవారం పరామర్శించారు. తొలుత పాతూరి అక్షర ఇంటికి వెళ్లి తల్లిదండ్రులు పాతూరి త్రిమూర్తులు, సుబ్బలక్ష్మిలను ఓదార్చారు. అక్షర చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం దేవదాసి లిషితను, తల్లిదండ్రులు సురేంద్ర,విజయలక్ష్మిలను పరామర్శించారు. ఈ సందర్భంగా రెండు కుటుంబాలకు రూ. 30 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ నాయకులు రేగుళ్ల రాజు, గునిపే అశోక్, మిరప రమేష్, డాక్టర్ బొల్లంగి సత్యగిరి, దాసరి ధర్మ, మిరప మహేష్, దేవదాసి చక్రి, శివ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ పీజీఆర్ఎస్‌కు 23 అర్జీలు



అర్జీదారులతో మాట్లాడుతున్న ఏఎస్పీ సుబ్బరాజు

కంబాలచెరువు: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం జరిగిన పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రెసెల్ సిస్టం (పీజీఆర్ఎస్)కు 23 అర్జీలు వచ్చాయి. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారులతో ఏఎస్పీలు ఎంబీఎన్ మురళీకృష్ణ, ఏవీ సుబ్బరాజు స్వయంగా మాట్లాడారు. వారి అర్జీలను స్వీకరించి, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వెంటనే సంబంధిత స్టేషన్ పోలీసు అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి ఫిర్యాదిదారుల సమస్యలను చట్ట పరిధిలో పరిష్కరించి, సత్వరమే న్యాయం చేయాలని ఆదేశించారు.

రాజ్యాంగ పరిరక్షణ కార్యక్రమం

కడియం: మండల కేంద్రమైన కడియంలో సోమవారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో ప్రజాస్వామ్య సంరక్షణ, రాజ్యాంగ పరిరక్షణ కార్యక్రమం నిర్వహించారు. రూరల్ కో ఆర్డినేటర్ తాడాల కొండ్రాజు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి హాజరయ్యారు. కాంగ్రెస్ పార్టీ రూపొందించిన బుల్లెట్ పాయింట్లు పోస్టర్లను ఇంటింటికీ పంపిణీ చేస్తామన్నారు.

నన్ను క్షమించు.. జున్ను జాగ్రత్త

భార్యకు మెసేజ్ పెట్టి వ్యక్తి అదృశ్యం



సలాది రాంబాబు

రాజానగరం: 'నన్ను క్షమించు.. నిన్ను వదిలి వెళుతున్నాడు.. జున్ను (కొడుకు) జాగ్రత్త' అంటూ ఓ వ్యక్తి తన భార్యకు మెసేజ్ పెట్టి అదృశ్యమయ్యాడు. వివరాల్లోకి వెళితే.. కడియపులంకలోని ముసలమ్మ గుడి వీధిలో నివాసం ఉంటున్న సలాది రాంబాబు (28), భార్య స్వాతితో కలిసి రాజానగరంలోని కొత్త కాలనీలో ఉంటున్న ఎన్.లక్ష్మీప్రసన్న ఇంటికి శనివారం రాత్రి వచ్చారు. భోజనాలు చేసి, రాత్రికి అక్కడే నిద్రించారు. తెల్లవారిన తర్వాత లేచి చూసే సరికీ రాంబాబు కనిపించలేదు. దీంతో స్వాతి, బంధువులు పరిసరాల్లో గాలించినా, బంధువులకు ఫోన్ చేసి వాకబు చేసినా ఫలితం లేకపోయింది. దీంతో రాజానగరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే అదృశ్యమైన తర్వాత రాంబాబు ఫోన్ నుంచి స్వాతికి 'నన్ను క్షమించు, నిన్ను వదలివెళ్తున్నాను, జున్ను (కొడుకు) జాగ్రత్త' అంటూ మెసేజ్ వచ్చింది. దీంతో అందరూ రాంబాబుకు ఏం జరిగిందోనని కంగారు పడుతున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని రాజానగరం ఎస్సై ఏకే సత్యనారాయణ తెలిపారు. రాంబాబుకు అప్పుల బాధలు గానీ, కుటుంబ సమస్యలుగానీ ఏమీ లేవని చెబుతున్నారు. మరి ఎందుకు అదృశ్యమయ్యాడో ఎవ్వరికీ తెలియడం లేదు. అతడి ఆచూకీ తెలిసిన వారు 98483 79998కు ఫోన్ చేసి, సమాచారం ఇవ్వాలని కోరుతున్నారు.

డీసీసీబీ మాజీ చైర్మన్ ఆకుల వీర్రాజుకు పరామర్శ



ఆకుల ఈశ్వరమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి వేణు, డాక్టర్ గూడూరి శ్రీనివాస్ తదితరులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సహకార కేంద్ర బ్యాంకు మాజీ చైర్మన్ ఆకుల వీర్రాజును సోమవారం పలువురు పరామర్శించారు. వీర్రాజు మాతృమూర్తి ఈశ్వరమ్మ ఆదివారం స్వర్గస్తులైన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఈశ్వరమ్మ చిత్రపటానికి మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, రాష్ట్ర బీజేపీ అధ్యక్షురాలు, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, వైఎస్సార్ సీపీ పార్లమెంటు పరిశీలకుడు డాక్టర్ గూడూరి శ్రీనివాస్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆకుల వీర్రాజు, కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి గిరిజాల వీర్రాజు (బాబు), కడియం మండల అధ్యక్షుడు యాదల సతీష్‌చంద్ర స్టాలిన్, మాజీ జడ్పీటీసీ దొంతంశెట్టి చిన్న వీరభద్రయ్య, యాక్షన్ స్వచ్ఛంద సంస్థల కో ఆర్డినేటర్ మేడ గురుదత్త ప్రసాద్, ప్రముఖ న్యాయవాది మద్దూరి శివసుబ్బారావు, మాజీ చాంబర్ అధ్యక్షులు పోకల సీతయ్య, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, ఆర్యాపురం అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ యెనుముల రంగబాబు, వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షులు బొప్పన సుబ్బారావు, జిల్లా కార్యదర్శి యెనుముల త్యాగరాజు, మాజీ సొసైటీ అధ్యక్షుడు దండమూడి అర్జునరావు, నాయకుడు పడాల వీరప్రసాద్ తదితరులు పరామర్శించారు.

శైలజ కుటుంబానికి..

కడియం: మాతృవియోగంతో బాధపడుతున్న పార్టీ మహిళా నాయకురాలు ఊటుకూరి శైలజ కుటుంబాన్ని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస వేణుగోపాలకృష్ణ పరామర్శించారు. బుర్రిలంకలో శైలజ ఇంటికి పార్టీ నాయకులతో కలిసి వెళ్లి తన ప్రగాఢ సంతాపం తెలిపారు. ఆయన వెంటన రాష్ట్ర కార్యదర్శి గిరజాల వీర్రాజు, మండల అధ్యక్షుడు సతీష్‌చంద్ర స్టాలిన్, పార్టీ నాయకులు ఈలి గోపాలం, బోడపాటి సత్తిబాబు, కొత్తపల్లి శివాజీ, దాసరి శ్రీను, ఆలమూరి శ్రీను, రామకృష్ణ ఉన్నారు.

అన్ని వర్గాల సంక్షేమమే ప్రధాని మోదీ ధ్యేయం



వికసిత్ భారత్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీ పురందేశ్వరి తదితరులు

రాజమహేంద్రవరం సిటీ: అన్ని వర్గాలకు సంక్షేమాన్ని అందించడమే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ధ్యేయమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. భారత ప్రధాని నరేంద్ర మోదీ 11 ఏళ్ల పాలనపై జేఎన్ రోడ్డులోని చెరుకూరి ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను సోమవారం ఆయన ప్రారంభించారు. అనంతరం ప్రధాని మోదీ 11 ఏళ్ల సుపరిపాలన, ప్రజా సంక్షేమంపై వృత్తి నిపుణుల (ప్రొఫెషనల్స్)తో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఎంపీ పురందేశ్వరి మాట్లాడుతూ ఆపరేషన్ సిందూర్‌తో మన జవాన్ల శక్తి ప్రపంచానికి తెలిసిందన్నారు. అనంతరం వికసిత్ పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ పురస్కారాల ప్రదానం

సీటీఆర్ఐ: నందమూరి తారక రామారావు పేరున పురస్కారం అందుకోవడం తన అదృష్టమని ఎన్టీఆర్ పురస్కార గ్రహీత డాక్టర్ ఎంబీ నాగేశ్వరరావు అన్నారు. ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, ఫిలాంత్రోఫిక్ సొసైటీ అధ్యక్షుడు అద్దంకి రాజాయోనా ఆధ్వర్యంలో సోమవారం ఎంపీ నివాసంలో విభిన్న రంగాలలో విశేష ప్రతిభ కనబరచిన డాక్టర్ ఎంబీ నాగేశ్వరరావు (తాడేపల్లిగూడెం), రిమ్మలపూడి సత్యనారాయణ మూర్తి (మద్రిపూడి))లకు ఎన్టీఆర్ కీర్తి పురస్కారాలను అందించి ఘనంగా సత్కరించారు. ఎన్టీఆర్ సినీ వజ్రోత్సవ వేడుకలను పురస్కరించుకుని ఫిలాంత్రోఫిక్ సొసైటీ, పాన్ ఇండియా సోషియో కల్చరల్ అసోసియేషన్ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాయి.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

రంగంపేట: శారీరక, మానసిక ఆరోగ్యానికి నిరంతరం యోగా చేయాలని విద్యుత్ ఏఈ తోట శిరీష అన్నారు. జి.దొంతమూరులోని ఇస్కాన్‌లో సోమవారం రవీంద్ర చైతన్య దాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యక్తిగత, కుటుంబ, సామాజిక ఆరోగ్యానికి ప్రతి రోజూ కొంత సమయాన్ని యోగాభ్యాసం చేయడానికి కేటాయించాలన్నారు. ఒత్తిడి లేని జీవితానికి ధ్యానం, యోగా ఎంతో ఉపయోగపడుతుందన్నారు. తద్వారా ఆరోగ్యకర జీవనం గడపవచ్చన్నారు.

ఆ ఎమ్మెల్యేలకు క్యాబినెట్ హోదా ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న రామారావు

సీటీఆర్ఐ: పుష్కరాల నిర్వహణ కోసం స్థానిక ఎమ్మెల్యేలకు క్యాబినెట్ హోదా ఇవ్వాలని రాష్ట్ర బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనారిటీ సంక్షేమ సంఘం నాయకులు కోరారు. సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు సానబోయిన రామారావు అధ్యక్షతన సోమవారం సంఘ కార్యాలయంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో పలు తీర్మానాలు చేశారు. రామారావు మాట్లాడుతూ రానున్న గోదావరి పుష్కరాలు సజావుగా సాగేందుకు, 2015 పుష్కరాల నాటి దురదృష్టకర సంఘటనలు పునరావృతం కాకుండా చూసేందుకు రాజమండ్రి సిటీ, రూరల్ ఎమ్మెల్యేలకు కేబినెట్ హోదా కలిగిన బాధ్యతలు అప్పగించాలని ప్రభుత్వాన్ని కోరారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎల్‌వీ ప్రసాద్ మాట్లాడుతూ తమకు రాజకీయాలతో సంబంధం లేదని, ఏ ప్రభుత్వం మంచి చేసినా అభినందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో సంఘ నాయకులు పాల్గొన్నారు.

నిర్ణీత గడువులో అర్జీల పరిష్కారం



అర్జీ స్వీకరిస్తున్న అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్

రాజమహేంద్రవరం సిటీ: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన ప్రతి అర్జీని నిర్ణీత గడువులోపు పరిష్కరించాలని అడిషనల్ కమిషనర్ పీవీ రామలింగేశ్వర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదికకు 16 అర్జీలు వచ్చాయి. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకట రమణ, సెక్రటరీ జి.శైలజావల్లి, ఎస్ఈ (ఇంజినీరింగ్) ఎంసీహెచ్ కోటేశ్వరరావు, మేనేజర్ ఎండీ అబ్దుల్ మాలిక్, ఎంహెచ్ఓ వినూత్న పాల్గొన్నారు.